## క్లుప్తంగా

### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలసిన అశోక్



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను కలసిన జిల్లా పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్

**అమలాపురం టౌన్:** వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షునిగా ఎన్నికైన అమలాపురానికి చెందిన న్యాయవాది కుడుపూడి అశోక్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అమలాపురంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కార్యాలయాలకు వెళ్లి వారి సహకారాన్ని అశోక్ అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అశోక్ సత్కరించారు. వారు కూడా అశోక్‌కు అభినందనలు తెలిపారు. ఆయన వెంట అమలాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని ఉన్నారు.

### నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**ఐ.పోలవరం:** మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ మోకా రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మురమళ్ల, ఐ.పోలవరం సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు, 33 కేవీ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఈ ఆటంకం కలుతుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

### 'భాషా సంగమ్' ప్రారంభం



భాషా సంగమ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**యానాం:** పాఠశాల విద్యా శాఖ, అక్షరాస్యతా విభాగం, విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో భారతీయ భాషా ఉత్సవ్ పేరుతో భాషా సంగమ్ కార్యక్రమం గురువారం స్థానిక నవోదయ విద్యాలయలో ప్రారంభమైంది. భాషలు వేరైనా భావం ఒకటే అనే థీమ్‌తో ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబర్ 11 వరకూ 75 రోజుల పాటు జరుగుతుందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. తమిళకవి, స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్యభారతి జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. విద్యార్థులు వివిధ ప్రాంతాలకు చెందిన వస్త్రాధారణతో పాటు, వివిధ భాషల సమాహారాన్ని తెలియజేస్తూ పలు గీతాలను ఆలపించారు. మాతృభాషపై మమకారం పెంచడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని వైస్ ప్రిన్సిపాల్ బేగం అన్నారు.

### ఘనంగా మిలాద్-ఉన్- నబీ వేడుకలు



అమలాపురం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

**అమలాపురం టౌన్:** స్థానిక మొల్ల ముస్తాఫా, జమియా మసీదుల్లో మిలాద్-ఉన్-నబీ వేడుకలను పట్టణ ముస్లింలు గురువారం వైభవంగా నిర్వహించుకున్నారు. అలైహి వసల్లం జన్మదిన వేడుకల సందర్భంగా చిన్న పిల్లలకు ఉర్దూ, అరబిక్ పాఠ్యాంశాల్లో చదువుల పోటీ, ఇమామ్ మహ్మద్ రాజా సాహెబ్‌చే పురవీధుల్లో ముబారక్ షరీఫ్ వాజ్ (భారీ ర్యాలీ) నిర్వహించారు. అనంతరం ఆ రెండు మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ముల్లా ముస్తాఫా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో మసీదు కమిటీ ప్రతినిధులు మొయినుద్దీన్, ఎండీ అమీర్, షేక్ అబ్దుల్ ఖాదర్, ఎండీ ఆజామ్, ఎండీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రై సైకిల్ అందజేత



భాస్కరరావుకు ట్రై సైకిల్ అందజేసిన జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరి

**అమలాపురం రూరల్:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న వన్నె చింతలపూడి గ్రామానికి చెందిన మంగం భాస్కరరావుకు జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్ చేతుల మీదుగా ట్రై సైకిల్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్కరరావుకు బ్యాటరీ మోటార్ సైకిల్ అందజేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా రాజబాబు, కుంచె వెంకటేశ్వరరావు, శివ, నక్కా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరస్తు.. ఆరోగ్యమస్తు

- జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు
- నియోజకవర్గంలో వైద్య శిబిరాలకు చర్యలు



ఈదరపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా (ఫైల్)

**అమలాపురం రూరల్:** ఆరోగ్యం.. ఆ ఇంటికి మహాభాగ్యం. ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ఇంటింటా చురుగ్గా సాగుతోంది. శనివారం నుంచి ప్రతి మండలంలో గ్రామ సచివాలయాల వారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహణకు షెడ్యూల్ నిర్ణయించారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఈ నెల 15 నుంచి వలంటీర్లు, పీహెచ్‌సీల వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తున్నాన్నారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో సుమారు 2.18 లక్షల మంది జనాభా ఉండగా, సుమారు 56 వేల మంది సర్వే పూర్తయ్యింది. ఇందులో గుర్తించిన రోగులకు వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. ఈ ఆరోగ్య సురక్ష శిబిరాలను తహసీల్దార్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో నిర్వహిస్తారు. మండలంలో రోజుకు ఒక సచివాలయం పరిధిలో వైద్య శిబిరం జరుపుతారు. ఇద్దరు వైద్యులతో పాటు మరో ఇద్దరు వైద్య నిపుణులు సేవలందిస్తారు. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధిని బట్టి మందులు ఇస్తారు. శస్త్రచికిత్సలు, మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని ప్రభుత్వాసుపత్రి, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు తరలిస్తారు.

**పరిశీలించి.. అవగాహన కల్పించి**

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణపై వైద్య సిబ్బంది, ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు ఈదరపల్లి అంబేడ్కర్ భవనంలో మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి పలు అంశాలు వివరించారు. ఈ శిబిరాల ద్వారా పేదల ఆరోగ్య పరిరక్షణకు భరోసా కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య శిబిరాల చోట పది కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ సర్జరీ సం



అల్లవరంలో ఓ ఇంటి వద్ద ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ప్రదింపుల విభాగం, చిన్నపిల్లల, ప్రసూతి వైద్య నిపుణుల విభాగాలు, జనరల్ వైద్యుల విభాగం, ఆరోగ్యశ్రీ కౌంటర్, క్షయ వ్యాధి నివారణ వైద్య పరీక్షల డెస్క్, దంత వైద్య డెస్క్, మందుల పంపిణీ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విభాగం వద్ద వైద్య పరీక్షల పేపర్ వర్క్ ఆన్‌లైన్ నమోదుకు సంబంధించి సిబ్బంది ఉంటారు. ప్రతిఒక్కరి ఆరోగ్య వివరాలు కేస్ షీట్‌లో నమోదు చేసి వైద్య సేవలు పర్యవేక్షిస్తారు. రోగికి ఏరకమైన వైద్య సేవలు అవసరమో గుర్తించి వారికి రిఫర్ చేసిన శస్త్ర చికిత్సలు సమీపంలోని ఆసుపత్రులలో నిర్వహించే విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా సహకరిస్తారు. ఈ శిబిరాల్లో 14 రకాల ల్యాబ్ పరీక్షలతో పాటు 105 రకాల మందులను ఉచితంగా అందిస్తారు. ఇదిలా ఉంటే బోడసకుర్రు సచివాలయం-2లో శనివారం ఏర్పాటయ్యే వైద్య శిబిరాన్ని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభిస్తారు. అలాగే అమలాపురం మండలం తాండవపల్లి, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలనూ ప్రారంభిస్తారు.

**చురుగ్గా సురక్ష సర్వే**



ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే గ్రామాల్లో చురుగ్గా జరుగుతోంది. పీహెచ్‌సీల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రోగులను గుర్తిస్తున్నారు. అవసరమైన వారికి మందులు ఇవ్వడంతో పాటు వారికి ఒక టోకెన్ ఇచ్చి ఈ శనివారం నుంచి తాండవపల్లిలో ప్రారంభమయ్యే వైద్య శిబిరాలకు సిఫార్సు చేస్తున్నారు. సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

–ములపర్తి శాంతిలక్ష్మి,
పీహెచ్‌సీ, వైద్యాధికారి, పేరూరు

## ఎమ్మెల్యే పొన్నాడకు సత్కారం



ఎమ్మెల్యే పొన్నాడను సత్కరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

**అమలాపురం టౌన్:** కొబ్బరి కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన ముమ్మిడివరం ఎమ్మెల్యే, రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘ గౌరవాధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను ఆ సంఘ రాష్ట్ర నేతలు గురువారం ఘనంగా సత్కరించారు. అమలాపురంలోని ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహంలో రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు ఆయనను కలసి కొబ్బరి సమస్యలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే పొన్నాడకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. కొబ్బరి కార్మికుల సమస్యలను సీఎం జగన్ దృష్టిలో పెట్టానని, ఆయన సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కొబ్బరి కార్మికుల సంఘ అధ్యక్షుడు జోగి ఏడుకొండలు, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో పోటీకి సిద్ధం: మల్లాడి

**యానాం:** యానాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మళ్లీ పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రాజీనామా చేసి తన సవాలును స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా అని పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అశోక్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. తాను ఎన్నికల్లో ఓడిపోతే యానాం వదిలి వెళ్లిపోతానని అన్నారు. ఉద్యోగస్తుల నియామకంలో మాజీ మంత్రిగా పరపతి ఉపయోగించుకుని వారిని తెచ్చుకుంటున్నానని, దీనికి ఎమ్మెల్యేకు ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా పేకాట క్లబ్, పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న హెచ్ఆర్ స్క్వేర్ సంస్థపై, తాను ఇటీవల వరకూ టీటీడీ బోర్డు సభ్యుడిగా చేసిన పనులపైనా బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. పేకాటక్లబ్ ద్వారా నెలకు రూ.16 కోట్ల నుంచి రూ.17 కోట్ల వరకూ ఆదాయం వస్తుందని, ఈ సొమ్ము ఎక్కడకు వెళ్తుందని ఆయన ప్రశ్నించారు.

# బీమాను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి

**అమలాపురం టౌన్:** స్థానికంగా జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘం కార్యాలయంలో అక్టోబర్ 2న చేతి వృత్తిదారులకు తపాలా ప్రమాద జీవిత బీమా నమోదు కార్యక్రమం జరుగుతుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని చేతి వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం రూ.399తో ఏడాదికి రూ.10 లక్షల ప్రమాద బీమా పొందే అవకాశం ఉంటుందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం ఆయుష్మాన్ భారత్ పథకంలో కూడా నమోదు కావాలన్నారు. సమావేశంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంఘ ప్రతినిధులు పాటి వెంకట్రామయ్య, వాసంశెట్టి గణేష్ స్వామి, కొనుకు వెంకటేశ్వరరావు, లూటుకుర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాడిపై ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్యే గొల్లపల్లి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

**యానాం:** ప్రజాస్వామ్య రీతిలో జరిగిన ఎన్నికల్లో శాసనసభ్యుడిగా ఎన్నికైన తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్న పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుపై పుదుచ్చేరి శాసనసభా హక్కుల కమిటీకి ఫిర్యాదు చేస్తానని గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ విలేకరులకు తెలిపారు. తనకు ఏ మాత్రం సంబంధం లేని రాయల్ రిక్రియేషన్ క్లబ్ వ్యవహారాలను తనకు ఆపాదిస్తూ ఆరోపణలు చేయడం మల్లాడి మానుకోవాలని అన్నారు. అదేవిధంగా ఓఎన్జీసీ మత్స్యకారుల నష్టపరిహారం పంపిణీని అడ్డుకుంటున్నారని, వారి పరిహారం ఏళ్ల తరబడి పంపిణీ కాకుండా పుదుచ్చేరి స్థాయిలో ప్రయత్నించడం దారుణమన్నారు. తాను రెండేళ్ల వ్యవధిలో అనేక సంక్షేమ, ప్రజాభివృద్ధి కార్యక్రమాలను స్పీకర్, పుదుచ్చేరి మంత్రుల సహకారంతో చేయడానికి కృషి చేస్తుంటే ఓర్వలేని మల్లాడి తనపై నిందలు వేస్తున్నారన్నారు. 33 ఏళ్ల రాజకీయ జీవితం అని చెప్పే మల్లాడి తనపై 2021లోనే పోటీచేసి ఎందుకు గెలవలేక పోయారో ప్రజలకు చెప్పాలని అన్నారు.

# 1న ఓల్డేజ్ హోమ్ రజతోత్సవం



ఓల్డేజ్ హోమ్ 25 వసంతాల వేడుక బ్రోచర్‌ను ఆవిష్కరించిన మల్లాడి తదితరులు

**యానాం:** వచ్చే నెల 1న యానాం ఓల్డేజ్‌హోమ్ 25 వసంతాల వేడుకను నిర్వహిస్తున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, ఓల్డేజ్ హోమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు తెలిపారు. గురువారం ఆయన స్వగృహంలో ఓల్డేజ్ హోమ్ రజతోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒంటరిగా జీవిస్తున్న అభాగ్యులకు ఆశ్రయం కల్పించడానికి 1998లో ఓల్డేజ్ హోమ్ ప్రారంభించామన్నారు. ఇక్కడి బెజవాడ గార్డెన్స్‌లో అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి, ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాష్ నారాయణ, విశిష్ట అతిథులుగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, పీడబ్ల్యూడీ అండ్ కమర్షియల్ ట్యాక్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, న్యూఢిల్లీ ఎ.అన్బరసు, ఐఏఎస్, వైజాగ్ ప్రొఫైల్స్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు హాజరవుతారన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, ప్రముఖ సైనికాధికారులు, మాజీ సైనికోద్యోగులు, తెలుగురత్న, కలైమామణి అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయులు, కోవిడ్ సమయంలో సేవలు అందించిన వారికి, ఉత్తమ విద్యార్థులకు తదితరులను ఘనంగా సత్కరిస్తామన్నారు.

### స్వామినాథన్ మృతికి సంతాపం

**అల్లవరం:** భారతదేశ హరిత విప్లవ పితామహుడు డాక్టర్ పద్మ విభూషన్ స్వామినాథన్ మృతి రైతాంగానికి తీరని లోటని ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జున్నూరి రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆహార భద్రత కల్పించడంలో కృషి చేసిన మహనీయుడు, వ్యవసాయ రంగంలో ఆదాయం పెంపొందించేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు చేశారని అన్నారు.

# మహాకవి గుర్రం జాషువా



అమలాపురంలో గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు



కవి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు

**అమలాపురం టౌన్:** జీవిత కష్టాల్లోంచి నిజాయితీ, ఆర్తి, ఆవేశం, ప్రతిఘటనలతో కవిత్వాన్ని పుట్టించిన మహాకవి గుర్రం జాషువా తన అభ్యుదయ భావాలతో సమాజాన్ని చైతన్యం చేశారని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. జాషువా జయంతి సందర్భంగా స్థానిక కూచిమంచి వారి అగ్రహారంలో ఆ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ మహాకవి సాహితీ సేవలను కొనియాడారు. కళా వేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘ అధ్యక్షుడు, కవి బీవీవీ సత్యనారాయణ, కళా వేదిక ఉపాధ్యక్షుడు గుర్రం రామకృష్ణారావు, తెలుగు అధ్యాపకుడు మాకే బాలార్జున సత్యనారాయణ, విశ్రాంత పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్, కవి అద్దంకి అమరేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో జాషువా కవిత్వ వైభవంపై కవితా గానాలు చేశారు.

**ఐ.పోలవరం:** స్థానికంగా పీటీఎం సంస్థ ఆధ్వర్యంలో జాషువా జయంతిని నిర్వహించారు. జాషువా చిత్రపటానికి జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి తదితరులు పూలమాలలు వేశారు. పీటీఎం సంస్థ వ్యవస్థాపకుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టూరిజం బోర్డు డైరెక్టర్ వి.వెంకటాచలం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వీధి సురేష్ బాబు, దంగుడుబియ్యం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

**అమలాపురం రూరల్:** కామనగరువులో మాదిగ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు నివాసంలో బాబూ జగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కవితా విశారద గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. మడికి సత్యనారాయణ అధ్యక్షతన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, సంఘ సభ్యులు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఏపీసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పి.జాన్సన్ బిల్లి, సబ్ రిజిస్ట్రార్ రాయి రాంబాబు, మాజీ సర్పంచ్ నేదునూరి నతానియేలు, సంఘ జిల్లా కార్యదర్శి తెన్నేటి రాజబాబు పాల్గొన్నారు.

# వక్రతుండాయా.. వందనం

**భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవాలు**



అమలాపురం సీతాపతిరావుపేటలో వినాయక విగ్రహాన్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



సుంకరపాలెంలో శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి ఊరేగింపులో వివిధ వేషధారణలు

**అమలాపురం టౌన్:** వక్రతుండాయా.. వందనం అంటూ ఆ స్వామివారికి భక్తజనం జేజేలు పలికింది. వినాయక నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా లంబోదరునిని సాదరంగా సాగనంపారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమలాపురం సీతాపతిరావుపేట ఏటిగట్టు వద్ద డీజిల్ మెకానికర్లు ఏర్పాటు చేసిన చవితి పందిరిలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. తొలుత అన్నసమారాధనలో వేలాది మంది పాల్గొన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అతిథులుగా పాల్గొని గణపతి విగ్రహానికి పూజలు చేశారు. మెకానిక్స్ అసోసియేషన్ల ప్రతినిధులు సుందరనీడి వెంకటేశ్వరరావు, కాశీ చంటి, యనమదల వెంకటేశ్వరరావు, సంగాని రాంబాబు, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

**తాళ్లరేవు:** మండలంలోని ప్రధాన వినాయక ఆలయాలతో పాటు పలు గ్రామాల్లోని మండపాల్లో వినాయక విగ్రహాలను ఆత్రేయ, గౌతమి గోదావరిలలో నిమజ్జనం చేశారు. సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో శ్రీలక్ష్మీ గణపతి స్వామివారిని వర్తక సంఘ సభ్యులు ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. పాతకోరంగిలో అన్నదానం నిర్వహించారు. శ్రీవరసిద్ధి వినాయక ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానానికి అనేక మంది భక్తులు తరలివచ్చారు.

# 'ఆరోగ్య సురక్ష' ప్రజలకు వరం



అమలాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సత్య నాగేంద్రమణి

**అమలాపురం టౌన్:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి వరం లాంటిదని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక 23వ వార్డులో చేస్తున్న ఆరోగ్య సర్వేను గురువారం ఆమె పరిశీలించారు. అలాగే ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ప్రక్రియను కూడా ఆమె పర్యవేక్షించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేసి సాధారణ వైద్యమైతే అక్కడికక్కడే అందిస్తున్నారు. రోగం తీవ్రతను బట్టి పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రులకు రోగిని సిఫార్సును చేసి పంపించి దగ్గరుండి వైద్యం అందిస్తున్నారు.

# ఘనంగా శెట్టిబలిజ సంఘ వార్షికోత్సవం



శెట్టిబలిజ సంఘ వార్షికోత్సవంలో సంఘీయులకు సత్కారం

**అమలాపురం టౌన్:** కేంద్ర శెట్టిబలిజ సంఘం 104వ వార్షికోత్సవాన్ని స్థానిక సూర్యనగర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ ప్రతినిధి డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు మాట్లాడుతూ దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి 1920లో బోడసకుర్రులో సంఘీయులను సంఘటితం చేసి కేంద్ర శెట్టిబలిజ సంఘాన్ని స్థాపించారని చెప్పారు. డాక్టర్ రాయుడు తన ప్రసంగంలో వెంకటరెడ్డి వ్యక్తిత్వాన్ని వివరించారు. వెంకటరెడ్డి ఏడో తరం వారసుడైన దొమ్మేటి బాల రామమోహనరావుతో పాటు మరికొంత మంది సంఘీయులను సత్కరించారు. సంఘ ప్రతినిధులు రాయుడు త్రినాథరావు, కడలి సత్యనారాయణ, ఎం.శివప్రసాద్, అప్పారి లక్ష్మీనారాయణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి ప్రసాదం.. మహా భాగ్యం



అల్లవరం పాలంలో గణపతి లడ్డూను రూ. 95 వేలకు దక్కించుకున్న కాంద్రేగుల వెంకటేశ్వరరావు

**అల్లవరం:** వినాయక నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మండపాల్లో స్వామివారి ప్రసాదాలకు గురువారం వేలంపాటలు నిర్వహించారు. ఆ లడ్డూ ప్రసాదాన్ని భక్తులు పోటీపడి మరీ దక్కించుకున్నారు. అల్లవరం పాలంలో చొల్లంగి వెంకటేశ్వరరావు దంపతులు గణపతికి సమర్పించిన 16 కిలోల లడ్డూను చొల్లంగి గంగాధర్, శేషారత్నం దంపతులు ఆలయం వద్ద జరిగిన వేలంలో రూ. 95 వేలకు దక్కించుకున్నారు. శ్రీరామ శెట్టిబలిజ కమిటీ ఆధ్వర్యంలో కాంద్రేగుల వెంకటేశ్వరరావు, వెంకటమహాలక్ష్మీలు స్వామివారికి తొమ్మిది రోజుల పాటు పూజలు చేశారు. అనంతరం గణపతి విగ్రహ నిమజ్జనోత్సవం జరిగింది. అమలాపురం మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

**అమలాపురం రూరల్:** చిందాడగరువులో సీతారామాలయం వద్ద గణపతి లడ్డూను శీలం సునీల్ కుమార్ రూ.41 వేలకు దక్కించుకున్నారు. ఆలయం వద్ద గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదానం, నిమజ్జనోత్సవం నిర్వహించారు.

**తాళ్లరేవు:** పి.మల్లవరంలో గణపతి స్వామి లడ్డూ ప్రసాదాన్ని హైటెక్ బ్యాచ్ సభ్యులు రూ.75 వేలకు దక్కించుకున్నారు. జి.వేమవరం మట్లపాలెం కాలనీ శ్రీవరసిద్ధి వినాయక మండపంలో ఏర్పాటు చేసిన 50 కిలోల లడ్డూను వైఎస్సార్ సీపీ నాయకుడు దెయ్యాల సత్తిబాబు రూ.28,500కు పాడుకున్నారు. పాతకోరంగి శ్రీవరసిద్ధి వినాయక లడ్డూను అడబాల వీరబాబు రూ.13 వేలకు దక్కించుకున్నారు. పాతకోరంగి శెట్టిబలిజ రామాలయం వద్ద వినాయక లడ్డూను యువజన సంఘం సభ్యులు రూ.9500కు పాడుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



చిందాడగరువులో లడ్డూతో ఊరేగుతున్న సునీల్‌కుమార్ తదితరులు



పి.మల్లవరంలో గణపతి లడ్డూను రూ.75 వేలకు దక్కించుకున్న హైటెక్ బ్యాచ్ సభ్యులు

### వృత్తి నైపుణ్యంపై శిక్షణ

**తాళ్లరేవు:** మత్స్యకార మహిళలకు ఫిష్ వాల్యూ ఎడిషన్‌కు సంబంధించి వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇచ్చారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో యూఎన్‌డీపీ–జీసీఎఫ్ వారి సౌజన్యంతో మండలంలోని 50 మంది మత్స్యకారులకు శిక్షణను మత్స్యశాఖ ఏడీ లావణ్య గురువారం ప్రారంభించారు. మూడు రోజులు శిక్షణ ఉంటుంది. ఎఫ్‌డీఓ జి.గోపి, గ్రామ మత్స్య సహాయకులు పాల్గొన్నారు.

### భూములు అప్పగించాలని ధర్నా

**తాళ్లరేవు:** ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిన భూములను అప్పగించాలని కోరుతూ దళితులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ప్రజా సంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పైడా కళాశాల వెనుక ప్రాంతంలో బూరుగు పుంతలో పంట కాలువ గట్టున పటవలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు 30 సెంట్లు చొప్పున 1977లో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఆ భూముల్లో కళాశాల యాజమాన్యం అక్రమ కట్టడాలు నిర్మించి, మిగిలిన భూముల్లో చెత్త వేసిందన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయగా, 28న కార్యాలయానికి ఆధారాలతో రావాలని అన్నారని, తీరా వస్తే తాళం వేసి ఉందని లబ్ధిదారులు వాపోయారు.